సమావేశంలో మాట్లాడుతున్న కళా జనార్దన మూర్తి

సంప్రదాయ కళల పరిరక్షణలో గానసభ కృషి

- గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి

చిక్కడపల్లి, జూలై 28: మరుగున పడిపోతున్న సంప్రదాయ జానపద కళలను తమ వంతుగా పరిరక్షించేందుకు గాను త్యాగరాయ గానసభ యాజమాన్యం ఒక నిర్ణయం తీసుకుందని గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి తెలిపారు. ఆది వారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గతించిన జాతీయ స్థాయి తెలుగు మహనీయులు స్మరిస్తూ వారి జయంతులను ఆరేండ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే క్రమంలో మరుగున పడిపోతున్న హరికథ, ఒగ్గు కథ, బుర్రకథ, చిందు యక్ష గానం, పద్య పౌరాణిక నాటకం సాంఘిక నాటకం, శాస్త్రీయ జానపద కళలు, మిమిక్రీలను బతికించేందుకు పూనుకున్నారు. అయితే, ఇటువంటి వైవిధ్య భరతమైన కళలకు గాన సభలోని ఆరు హాల్స్‌లో ఒక హాల్‌ను ప్రతి కళకు ఏదో ఒక హాల్‌ను ప్రతి రోజు ఉచితంగా కేటాయించనున్నారు. ఈ విధంగా 365 రోజులు ఉచితంగా కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కళల్లో ప్రతిభావంతులు తమ ప్రదర్శనకు వేదిక కోసం గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి సెల్‌ఫోన్ నం. 93999 20008 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు హాస్య అవధాని జర్నలిస్ట్ శంకరనారాయణ, చక్రపాణి, బండి శ్రీనివాస్, గీతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

కోణం ఫౌండేషన్ 'కృషి' కార్యక్రమం అభినందనీయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖులు

రామగిరి, జూలై 28 : సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించేలా రైతులను ప్రోత్సహించేలా కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కృషి' కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో నల్లగొండకు చెందిన ఉపాధ్యాయుడు కోణం శ్రీనివాస్ కుమారుడు సాందీప్ నిర్వహించే 'కృషి' కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 8సంవత్సరాలుగా భారతీయ రైతాంగం స్థితిగతులను అంచనా వేస్తూ వ్యవసాయ రంగంలో దిగుబడులు పెంచేలా ప్రత్యేక యాప్ తయారు చేసి ఇప్పటికే ఒడిశాలలోని రాయగడ్, నాయగడ్ రైతులకు ఎంతో లాభం జరిగిందన్నారు. రైతులు వెబ్‌సైట్ https://konam foundation.org, Krishi Glimpse: https://www.youtube. com/watch? v=j _hZcc-FJK4 లాగిన్ అయితే ఉచిత సమాచారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ.గోనారెడ్డి, కోణం ఫౌండేషన్ ప్రతినిధులు మహేశ్, నరేశ్ , తండ్రి కోణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమలను నివారించి విష జ్వరాలను కట్టడి చేయాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

మున్సిపల్ చైర్మన్, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జూలై 28 : పట్టణంలో దోమలను నివారించి విష జ్వరాలను కట్టడి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైనేజీ సమస్యలు ఉన్న వార్డుల్లో ప్రతి రోజు శుభ్రం చేయాలని, ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేస్తూ దోమలను పూర్తిగా కట్టడి చేసి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలను పూర్తిగా కట్టడి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టే ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ కార్యక్రమం, వన మహోత్సవంతోపాటు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, సిబ్బంది పాల్గొన్నారు.

చందుపట్లలో అడిషనల్ కలెక్టర్ పర్యటన

నకిరేకల్ : చందుపట్లలో రాణి రుద్రమదేవి మరణ శిలాశాసనాన్ని కుటుంబ సమేతంగా పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నకిరేకల్, జూలై 28 : మండలంలోని చందుపట్ల గ్రామంలో ఆదివారం అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర పర్యటించారు. కాకతీయుల వంశస్తురాలైన రాణి రుద్రమదేవి మరణ శిలాశాసనాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. రుద్రమదేవి తవ్వించిన చెరువు, ఆమె ప్రతీకగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలోని రుద్రమదేవి చారిత్రక విశేషాలను అన్నింటిని సవివరంగా తెలుసుకున్నారు. చందుపట్లను పర్యాటక ప్రాంతాల జాబితాలో చేర్చాలని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని వివేకానంద యువజన మండలి మాజీ అధ్యక్షుడు డాక్టర్ టంగుటూరి సైదులు అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ అథహర్ పర్వేజ్, కార్యదర్శి సూర్యప్రకాశ్, కె. వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఆర్థిక సాయం అందిస్తున్న బాలనర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు

కట్టంగూర్, జూలై 28 : మండల కేంద్రానికి చెందిన చిలకమర్రి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ది ఫౌండేషన్ చైర్మన్ పెద్ది బాలనర్సయ్య గౌడ్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోగుల నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు అంతటి శ్రీను, నోముల వెంకటేశ్వర్లు, పొడిచేటి సైదులు, రెడ్డిపల్లి మనోహర్, యర్కల మల్లేశ్, చికలమర్రి పోతులూరు, చిలకమర్తి రవి ఉన్నారు.

గృహజ్యోతి అర్హులకు అందేనా?

అర్హులైన వారికి అందని ద్రాక్షగానే.. ఇంటి పథకం
దరఖాస్తులు సకాలంలో అందించినా.. నమోదు నిర్లక్ష్యంగానే...
తెల్ల రేషన్ కార్డులున్న వారు మాత్రమే అర్హులు అనడంతో.. మరోవైపునకు కథ

మేడ్చల్, జూలై 28(నమస్తే తెలంగాణ): సాధారణ ప్రజలకు ఎన్నో ఆశలు చూపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అయితే, గృహజ్యోతి పథకం అర్హులకు అందేనా? అన్న అనుమానాలు అనేకం సామాన్య ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. తెలుపు రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు ఉచిత కరెంట్ అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. రెండు వందల యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించే గృహలక్ష్మి పథకం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని అర్హులైన వారికి అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గృహజ్యోతి పథకానికి వచ్చిన దరఖాస్తులు 5,50 లక్షలు

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో రేషన్ కార్డులు 5,23,899 ఉండగా, గృహ విద్యుత్ వినియోగదారులు 15,14,262 మంది ఉన్నారు. అయితే, గృహలక్ష్మి పథకానికి సుమారు 5,50 పైచిలుకు మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొంత మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం వర్తించేలా చేస్తున్నారని, సగానికి పైగా రేషన్ కార్డులు ఉండి 200 యూనిట్ల విద్యుత్ వాడుతున్న వారికి గృహలక్ష్మి పథకం వర్తింపు జరగడం లేదన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు దరఖాస్తులు అందించినా దరఖాస్తుల నమోదును నిర్లక్ష్యం చేయడం మూలంగానే అర్హులకు గృహజ్యోతి పథకం అందడంలేదు. అయితే, అర్హులైన వారికి గృహలక్ష్మి పథకం అందేలా తిరిగి జిల్లా కలెక్టరేట్, మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాలలో తిరిగి దరఖాస్తులను చేసుకునేలా సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినా, ఎంత వరకు సఫలీకృతం అవుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. కాగా, రేషన్ కార్డులు ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుందని, అయితే, అనేక మంది నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసిన నేపథ్యంలో త్వరితగతిన నూతన రేషన్ కార్డులు అందించి గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద తిరిగి దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ల్యాండ్ పూలింగ్ వేగవంతం

- పెండింగ్‌లో ఉన్న భూసేకరణ వేగవంతమయ్యేలా చర్యలు
- భారీ లే అవుట్లతో రెవెన్యూపై దృష్టి పెట్టిన సర్కార్

సిటీబ్యూరో, జూలై 28(నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేసేలా కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర సర్కారు హెచ్ఎండీఏకు సూచించింది. భూ సేకరణ ప్రక్రియల్లో ఉన్న పురోగతి, భూముల లభ్యత అంశాలపై ప్రత్యేక నివేదికను హెచ్ఎండీఏ తయారు చేయనుంది. రైతుల నుంచి భూములను సేకరించి డెవలప్ చేయడం ద్వారా తన వాటాగా వచ్చిన భూములను విక్రయించేలా హెచ్ఎండీఏ ప్రణాళికలను అమలు చేయనుంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ల్యాండ్ పూలింగ్ వేగవంతం చేయడం వలన మార్కెట్‌పై ప్రభావం చూపేలా కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా పెరుగుతున్న భూముల ధరలకు అనుగుణంగా తమ వాటా శాతాన్ని పెంచాలనే డిమాండ్లు రైతుల నుంచి పెరుగుతున్నాయి. నగరం చుట్టూ ఉండే ప్రతాప సింగారం, కొర్రెముల, భోగారం, లేమూరు, దండు మల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 900 ఎకరాలకు పైగా భూమి డెవలప్‌మెంట్ కోసం ఇప్పటికే గుర్తించారు. తాజాగా, హైదరాబాద్ చుట్టూ దాదాపు 11వేల ఎకరాలకు పైగా భూమిని సమీకరించాలనే ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. కేవలం ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా భారీ లే అవుట్లను అవుటర్ రింగు రోడ్డు చుట్టూ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తోంది.

స్వప్రయోజనాలకు సంఘం పేరు దుర్వినియోగం

- టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం, ప్రధాన కార్యదర్శి డా. ముజీబ్

సుల్తాన్ బజార్, జూలై 28: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో జరుగుతున్న బదిలీలపై తాము ఎటువంటి ప్రకటనలు ఇవ్వలేదని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలు ఆదివారం స్పష్టం చేశారు. దిన పత్రికలలో కొన్ని ఉద్యోగ సంఘాల పేరిట వచ్చిన వార్తలతో తమకు సంబంధం లేదని తెలిపారు. కొంత మంది ఉద్యోగులు తమ స్వార్థం కోసం టీఎన్జీవో సంఘం పేరును దుర్వినియోగం చేసి తప్పుడు వార్తలు ప్రచారం చేయిస్తున్నారని, ఇది తమ దృష్టికి వచ్చిందని వారిపై తప్పని సరిగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ బదిలీలను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు విషయంలో టీఎన్జీవో సంఘం రాజీ పడబోమని వారు స్పష్టం చేశారు.

కూటి కోసం అరబ్బు కెళ్తే..

- చిత్రహింసలతో పనులు చేయించుకుంటున్నారు
- అరబ్ దేశాలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి
- మార్క్ పబ్లికేషన్స్ సీఈవో మురళీ రామకృష్ణారెడ్డి

మస్కట్‌లో చిక్కుకుపోయిన బాధితురాలితో మాట్లాడిస్తున్న మురళీ రామకృష్ణా రెడ్డి

ఖైరతాబాద్, జూలై 28: కూటి కోసం అరబ్ దేశాలకు వెళ్లి తిరిగి రాలేక వందలాది మంది అక్కడే మగ్గిపోతున్నారని మార్క్ పబ్లికేషన్ వ్యవస్థాపకులు, సీఈవో మురళీ రామకృష్ణా రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు స్థానికంగా పనులు దొరకక దుబాయి, మస్కట్, కువైట్ లాంటి దేశాలకు వెళ్తుంటారని, వారి ఆశను ఆసరా చేసుకొని కొందరు ప్రైవేట్ ఏజెంట్లు అడ్డికి పావుసేరు లెక్కన డబ్బులు తీసుకొని, వారిని అక్రమ మార్గంలో అరబ్ దేశాలకు పంపుతున్నారన్నారు. చదువుకున్న వారి కంటే చదుకోని వారు అక్కడ సురక్షితంగా ఉండే పరిస్థితి లేదని, ఇండ్లలో బానిసల్లా మార్చుకొని వారిని చిత్రహింసలకు గురిచేస్తూ పనులు చేయించుకుంటారన్నారు. ఎందరో అక్కడి వారు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్యలు సైతం చేసుకున్నారన్నారు. ప్రధానంగా ఆడపిల్లలను అక్కడ శారీరకంగా, లైంగికంగా హింసిస్తున్నారని, సరైన పద్ధతిలో వెళ్లకపోవడం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు. ప్రైవేట్ ఏజెంట్లు సొమ్ముకు ఆశపడి అక్కడికి అక్రమ మార్గంలో పంపుతున్నారని, అక్కడి వారు సైతం తప్పుడు మార్గంలో ఆడపిల్లలను రప్పించుకొని వారితో వెట్టిచాకిరి చేయిస్తూ హింసలకు పాల్పడుతున్నారన్నారు. అరబ్ దేశాలకు వెళ్లే భారత ప్రభుత్వ వ్యవస్థ అందుబాటులో ఉందని, దాని సాయంతో వెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. చాలా మంది అవగాహన లేకనే ప్రైవేట్ ఏజెంట్ల మోసానికి బలవుతున్నారన్నారు. ఇప్పటికే 15 మంది ఆడపిల్లలు అక్కడ చిక్కుకుపోయారని, కొందరిని ఎంబసి, స్వచ్ఛంద సేవకుల సాయంతో రప్పిస్తున్నామన్నారు.

కాలు విరిగినా కనికరించలేదు

మాది ఆంధ్రలోని తూర్పుగోదావరి జిల్లా గొల్లగొట్టిపాలెం. నాకు భర్త వెంకటేశ్, ఎనిమిదేండ్ల కొడుకు ఉన్నారు. రెండేండ్ల క్రితం సంజీవ్ అనే ఏజెంటు ద్వారా మస్కట్‌కు ఇంట్లో పనిచేసేందుకు వెళ్లాను. వంద రియాల్‌కు పనిలో కుదిరాను. యజమాని, అతని భార్య, ఇద్దరు పిల్లలకు సపర్యలు చేయడం నా ఉద్యోగం. చేరిన కొత్తలో కొద్ది రోజులు బాగానే ఉన్నారు. రోజులు గడుస్తున్నా కొద్ది నాపై చేయి చేసుకోవడం ప్రారంభించారు. రోజు నన్ను కొట్టే వారు చిత్రహింసలకు గురిచేశారు. పాస్‌పోర్టును లాక్కొని, నానా ఇబ్బందులు పెటేవారు. ఆ బాధలు భరించలేక రెండుసార్లు ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. ఇంట్లో వారికి ఫోన్ చేద్దామనుకుంటే చేయనివ్వరు. ఓ సారి కిందపడిపోగా, ఒక కాలు విరిగింది. అయినా వారు కనికరించలేదు. అలాగే, నాతో పనిచేయించుకున్నారు. మా అమ్మ కూడా ఖతర్‌లో పనిచేస్తుంది. ఇంటి పక్కనే ఉన్న ఓ మహిళ సహాయంతో మా అమ్మకు ఫోన్ చేశాను. ఆ ప్రయత్నం ఫలించ లేదు. అక్కడ ఉన్న తెలుగు వారి సాయంతో మురళీ రామకృష్ణారెడ్డి ఫోన్ నంబరు తీసుకొని ఆయనను సంప్రదించాను. అక్కడే ఉన్న తెలుగు వారు బొంతు నాగరాజు, రాజీలకు సమాచారాన్ని చేరవేశారు. వారు అక్కడి ఎంబసీని కలిసి తనను బంధ విముక్తురాలిని చేశారు.

– మంగ నిర్మలా కుమారి, బాధితురాలు

కార్యక్రమంలో పాల్గొన్న పూర్ణచందర్ రావు, బీసీ నాయకులు

బీసీ కులాల లెక్కలు తేల్చండి

ఖైరతాబాద్, జూలై 28: రాష్ట్రంలో బీసీలు లెక్కలు తేల్చాలని, తద్వారా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతమవుతారని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పూర్ణచందర్ రావు అన్నారు. బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లోఆదివారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి సిఫారసులు చేయాలంటే జానాభా లెక్కలు కావాల్సిందేనన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు రిజర్వేషన్లకు సైతం కులాల వారీగా లెక్కలు దోహదపడుతాయన్నారు. అన్ని కులాలకు లెక్కలు ఉన్నా బీసీల కులగణన లేదన్నారు. ఐక్యమత్యంతో జేఏసీగా ఏర్పడి ముందుకు వెళితేనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్, ఆమంచి రాజలింగం, వినోద, ఉమా, మహేందర్, శివన్న ముదిరాజ్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడిగా రఘుకిరణ్

నూతనంగా ఎన్నికైన బ్రాహ్మణ సేవా వాహిని నూతన కమిటీ

అడ్డగుట్ట, జూలై 28: బ్రాహ్మణ సేవా వాహిని తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా శేషం రఘుకిరణాచార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాజేశ్వర శర్మ, పతంజలి శర్మ, ముఖ్య ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శిగా అభిషేక్ శర్మ, ఉపాధ్యక్షులుగా రాకేష్, సహాయ కార్యదర్శులుగా వేణుమాధవ్, సందీప్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్వర రావుతో పలువురు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ, సంఘ స్థాపన నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికై అహర్నిశలు శ్రమిస్తున్నానని వ్యక్తి నూతన అధ్యక్షులు రఘుకిరణాచార్యులని ఆయన కొనియాడారు. అనంతరం, రఘుకిరణాచార్యులు మాట్లాడుతూ, బ్రాహ్మణ సంక్షేమానికి, అభ్యున్నతికి మరింతగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

డా. లోకేశ్వరరావు సజ్జాకు బ్లాక్ బక్ పయనీర్ రీసెర్చ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ లోకేశ్వర రావు సజ్జా

జూబ్లీహిల్స్, జూలై 28: భారతదేశంలో కరోనరీ సర్జరీని అభివృద్ధి చేయడానికి అంకితమైన సొసైటీ ఆఫ్ కరోనరీ సర్జన్స్ వ్యవస్థాకుడు, నిత్య పరిశోధకుడు డాక్టర్ లోకేశ్వర రావు సజ్జాను మరొక అవార్డు వరించింది. స్టార్ హాస్పిటల్‌లో కార్డియో థొరాసిక్ సర్జన్‌గా ఉన్న ఆయన పలు పరిశోధనల ఫలితంగా పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. తాజాగా వైద్య పరిశోధనలో ఇటీవల చేసిన కృషికి గాను బ్లాక్ బక్ పయనీర్ రీసెర్చ్-2024 అవార్డు దక్కింది. ఈ మేరకు ఆదివారం నగరంలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ సజ్జాను పలువురు వైద్యరంగ నిపుణులు అభినందించారు.

ముగిసిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో..

ఎల్బీనగర్, మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌కే హుస్సేన్, వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, ఫొటోటెక్ అధినేత జి.అభిమన్యురెడ్డి, కోశాధికారి ఎం.శైలేం దర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జయమాధురి, కార్యదర్శి తులసి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

– మన్సూరాబాద్, జూలై 28

ఆలయాల్లో సంప్రదాయ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలి

జూబ్లీహిల్స్, జూలై 28: ఆలయాల్లో సంప్రదాయ అర్చకత్వాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ జాతీయ శైవాగమ సదస్సు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. వంశ పారంపర్య అర్చకుల బదిలీలకు తెలంగాణ దేవాదాయ శాఖ చేపట్టిన చర్యలను సమావేశం ఖండించింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి చెరువుగట్టు గ్రామంలో శ్రీ సోమేశ్వర జ్ఞానపీఠం, తెలంగాణ ఆది శైవ బ్రాహ్మణ అర్చక సంఘం, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతీయ సదస్సును ఘనంగా నిర్వహిస్తున్నారు.

రెయిన్‌బో ఆధ్వర్యంలో అడల్ట్ వ్యాక్సినేషన్

జూబ్లీహిల్స్, జూలై 28: పీడియాట్రిక్ కేర్‌లో ఇప్పటి వరకు సేవలందించిన రెయిన్‌బో ఆధ్వర్యంలో వయోజనాభాకు టీకాల లక్ష్యం చేరేందుకు అడల్ట్ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. ఈ మేరకు నగరంలోని షెర్టన్‌లో ఏవీఓఎన్–అడల్ట్ వ్యాక్సినేషన్ ఔట్‌రిచ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల, రెయిన్‌బో బర్త్ రైట్ బై రెయిన్‌బో డైరెక్టర్ డాక్టర్ ప్రణతి రెడ్డి, డిలైట్ ఇండియా పార్ట్‌నర్ హెడ్ డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వరన్‌తో పాటు భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కవి అంజయ్యకు సాహితీ సాఫల్యం ప్రదానం

సిటీబ్యూరో, జూలై 28(నమస్తే తెలంగాణ): సిద్దిపేటకు చెందిన కవి, సీనియర్ జర్నలిస్ట్ కొమురవెల్లి అంజయ్యకు తెలుగు సాహితీ వనం జీవన సాఫల్య పురస్కారం(2024) అందుకున్నారు. రవీంద్ర భారతిలో ఆదివారం జరిగిన తెలుగు సాహితీవనం ఏడో వార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని అందించారు. గీతాయుధం కవితా సంపుటితో తెలుగు సాహిత్య వనంలో అడుగుపెట్టిన అంజయ్య, నడకబోనం, ఆకులు రాలుతున్నయి కవిత సంపుటాలను రచించారు. నాలుగు దశాబ్దాలుగా పత్రికా రంగంలో పనిచేసిన ఆయన, మంజీరా రచయితల సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. 1988 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ సాహిత్య సంఘాల పురస్కారాలను సొంతం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి కవితా పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు ఆడెపు లక్ష్మీపతి, ప్రజాశక్తి ఎడిటర్ సత్యజీ, అంపశయ్య నవీన్, యండమూరి వీరేంద్రనాథ్, ఏనుగు నరసింహారెడ్డి, శాంతి కృష్ణ, సందడి అరుణ, అనూరాధ, నాళేశ్వరం శంకరం, పాతూరి అన్నపూర్ణ, తోట అరుణా నాయుడు, గడ్డం శ్యామల, డాక్టర్ మౌనశ్రీ మల్లిక్, డాక్టర్ చమన్ సింగ్, బిల్లా శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.